**కథ**

# శారీ స్టోరీ

**అడపా రామకృష్ణ**

***నిలువెత్తు అద్దాల షోకేసుల్లో, సింథటిక్ పూత పూసిన అందాల భామల ఆకారాలు సింగారించిన రంగురంగుల క్రేప్ సిల్క్, బ్రాసో, కోరా, షిఫాన్, ఫ్యాన్సీ జరీ చీరల్లో శోభాయమానంగా కనిపిస్తుంటే, దానికి తోడుగా మిల్క్ వైట్ బల్బులు, ట్యూబ్ లైట్ల కాంతుల్లో దేదీప్యమానంగా అశేష జనాన్ని ఆకట్టుకుంటోంది ఆ వస్త్రాలయం.***

విమల్ కుమార్ అదే రూట్‌లో ఆఫీసు నుంచి తిరిగి వస్తూ ఆ బట్టల షాపు వైపు దృష్టి మళ్ళించాడు. సాయంత్రం అయిదు గంటలు కాలేదు. అప్పుడే అంత హంగామా. వాళ్ళ బిజినెస్ భవితవ్యం అంతా ఈ జనమే ఆదుకోవాలి మరి.

పొడుగాటి కటౌట్స్‌లో సుప్రసిద్ధ హీరోయిన్స్ సీత్రూ చీరల్లో తమ అంగాంగ అందాల్ని ప్రదర్శిస్తున్నారు. స్టుడెంట్స్ అంతా విరగబడి చూస్తూ, ఖుషీగా అరుస్తూ డ్యాన్సు చేస్తున్నారు. మరొక పక్క పొడుగాటి బ్యానర్స్, కార్డ్‌బోర్డుల్లో అందమైన దస్తూరీతో రకరకాల స్లోగన్స్.

'అందుకోండి మా ఆహ్వానం, మీదే ఈ వస్త్రనందనం', 'ఆనందంగా అడుగుపెట్టి లాభంగా వెళ్ళండి', 'ఆడపడుచులకు, యువతరానికీ, అన్ని వయసుల వారికీ మెగా ఆఫర్. త్వరపడండి. రండి'.

విమల్ కుమార్ మధ్య తరగతి కుటుంబీకుడు. 'అమ్మో! మనమా ఇక్కడ కొనేది' అనుకుంటాడు. రోజూ ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఆ చీరల దుకాణం వైపే చూడందే అతడి కళ్ళు వూరుకోవు. అయితే ఎలాగైనా, ఎప్పుడైనా అక్కడ ఏదో ఒకటి అక్కడ కొనాలన్న కోరిక అతడిలో వున్నా ఆర్థిక పరిమితి అనుమతించేది కాదు.

ఇంట్లో అడుగు పెట్టగానే శ్రీమతి మాటలు వినిపించాయి.

"అత్తయ్యా! మీ అబ్బాయి వచ్చారు. ఆలస్యం చేయకుండా అడగండి. మళ్ళీ పనుందని ఎటైనా వెళ్ళిపోగలరు" అంది విమల్ భార్య వందన.

అప్పటి వరకు ఓ మూల కూర్చుని కాయగూరలు తరుగుతున్న పూర్ణమ్మ 'హమ్మయ్య!' అబ్బాయి వచ్చాడనుకుంటూ నిండుగా వూపిరి పీల్చుకుంది.

శ్రావణ మాసం సందర్భంగా స్పెషల్ మెగా ఆఫర్. గొప్ప తగ్గింపు ధరల ప్రకటనను ఆరోజు న్యూస్ పేపర్లో చూసి ఇరుగింటి, పొరుగింటి అమ్మలక్కలతో పూర్ణమ్మ చర్చలు జరిపింది.

'ఆఫీసు నుంచి అబ్బాయి రాగానే మరో రెండొందలు అడిగి, అప్పుడప్పుడు వందా వందా జమ చేసి దాచుకున్న నాలుగు వందలతో కలిపి, ఓ మాంచి చీర డిస్కౌంట్‌లో కొనుక్కోవాలి' అని ఉదయం నుంచీ వువ్విళ్ళూరుతోందావిడ.

"ఏమైందీ! అత్తా కోడళ్ళిద్దరూ ఒకరిపై ఒకరు కారాలూ, మిరియాలూ నూరుకున్నారా? ఫిర్యాదు లేవన్నా వున్నాయా?" అంటూ ఒక్క నిమిషం ఆగి చూసి లోనికి వెళ్ళాడు. వందన భర్త వెనకాలే వెళుతూ– "అబ్బే! అదేం కాదండీ! అత్తయ్య ఈరోజు పక్కింటి పిన్ని గారితో షాపింగ్‌కి వెళ్ళాలనుకుంటున్నారు. పేపర్లో వేశారు. చవగ్గా చీరలు దొరుకుతున్నాయట! మీకోసం ఎదురు చూస్తున్నారు రండి!" అంది.

"నాకోసమా! దేనికి?" తన ప్రమేయం ఏముంటుందో అర్థం కాక అడిగాడు విమల్.

"తన దగ్గర నాలుగొందలు మాత్రమే వున్నాయట! మీరొక రెండొందలు సర్దితే..." వందన మాటలు పూర్తి కాకుండానే చిర్రెత్తుకొచ్చింది విమల్‌కి.

విసురుగా తల్లికి ఎదురుగా వస్తూ– "నెలాఖరు కదా అమ్మా! నీకు తెలియనిది ఏముంది? ఎలాగో సర్దుకో" అంటూ ఆమె చేతిలో పెట్టాడు కొంత అయిష్టంగానే. అయినా తప్పదు మరి. తల్లి అంతగా అడిగినా ఇవ్వలేదన్న నామోషీని తన భార్య ఎదుట భరించలేడు. ఆమె కూడా పదే పదే దెప్పుతుందనే బాధతో ఇచ్చేశాడు.

ఆ మర్నాడు ఆరొందలు ఖరీదు చేసే జరీ బోర్డర్ గోల్డ్ ప్రింటెడ్ వెంకటగిరి చీర కొనుక్కొచ్చింది పూర్ణమ్మ. విమల్ ఆఫీసు నుంచి వచ్చేసరికి ఇంట్లో కొత్తచీర ఎగ్జిబిషన్ అప్పుడే పూర్తయినట్టుంది. ఒకరికొకరు మీ చీర బావుందంటే మీ చీర అంతకన్నా బావుందని మెచ్చుకుంటూ వెళ్ళిపోతున్నారు ఇరుగు పొరుగు.

కొడుకుని చూడగానే పూర్ణమ్మ ఎంతో ఆనందంగా, ఆప్యాయంగా వచ్చి చీర చూపించింది.

అంతవరకూ పరధ్యానంగా వున్న విమల్ కుమార్ ఆ చీరని చూడగానే కళ్ళు చెదిరాయి. డిజైను, జరీ అంచు అతనికి నచ్చాయి.

"అమ్మా ఈ చీర చాలా బావుంది. ఎంతకు కొన్నావే" అని అడిగాడు సౌమ్యంగా.

"ఇది ఆరొందల్రా. అయినా నాలుగు వందలకే డిస్కౌంటులో వచ్చింది" అని గుట్టువిప్పింది. ఆ పక్కనే నిల్చున్న వందనకు చూపిస్తూ "నీకూ ఈ చీర చూడగానే నచ్చింది కదూ!" అన్నాడు ఆమె కళ్ళలో మెరుపుని చూస్తూ.

"అవునండీ! చాలా బాగుంది. ధర కూడా తక్కువే" అంది.

"అమ్మా! ఈ చీర వందనకిచ్చెయ్యవే! నువ్వు మళ్ళీ కొనుక్కుందువు గాని. జీతాలు అందగానే ఇస్తాను" అన్నాడు. పూర్ణమ్మ సంశయంలో పడింది.

వందన మాత్రం అత్తగారి ముఖం లోని భావాల్ని పసిగట్టి "అబ్బే వద్దండీ, తనెంతో ఇష్టపడి కొనుక్కుంటే అలా అంటారేమిటండీ" అంది భర్తను లౌక్యంగా మందలిస్తూ.

"ఒరేయ్ అబ్బాయ్! నీ వందా నీకు ఇస్తాను గానీ ఈ చీర మాత్రం అడక్కురా" అంటూ అతని చేతుల్లో వున్న చీర లాక్కుని నిర్మొహమాటంగా వెళ్ళిపోయింది పూర్ణమ్మ.

విమల్‌కి ఆరోజు రాత్రి భోజనం నయించలేదు. కళ్ళు మూసినా, తెరిచినా ఆ చీరే మెదిలింది.

బెడ్‌రూమ్‌లో కూడా భార్యతో అదే మాట అన్నాడు. "ఆ చీరకి మరో వంద రూపాయిలు అమ్మకిస్తే మారు మాటాడకుండా ఇచ్చేస్తుంది. ఆలస్యం చేయకుండా రేపు ఉదయాన్నే ఆ పని చేస్తాను" అన్నాడు వందనతో. భర్త తనపై చూపే ప్రేమ, ఆదరణకి వందన ఎంతో మురిసిపోయింది.

ఎప్పుడు తెల్లవారిందో ఏమో! సుప్రభాతం వినిస్తుంటే కళ్ళు నలుముకుని చూశాడు. తల్లితో మాట్లాడాలన్న ఆతృతలో వేగంగా పెరట్లోకి వచ్చాడు. తల్లిని చూసి అవాక్కయ్యాడు. వెంకటగిరి చీర కట్టుకుని తులసి కోట చుట్టూ ప్రదక్షిణలు చేయడం చూసి బిత్తర చూపులు చూడసాగాడు.

అలాగే మరో రెండు నెలలు గమ్మున గడిచాయి. అదే చీర కొనాలని తను ఎంత ఉబలాటపడ్డా వీలు కుదరలేదు. జీతం కూడా చాలక పోవడం చిరాకనిపించింది. కరెంటు బిల్లు, గ్యాస్ ధర పెరిగిపోవడంతో పాటు ఉల్లి ధరల ఘాటు నషాళానికంటింది. ఒంట్లో నలత..డాక్టర్ ఫీజు.. మందుల బిల్లు పడటంతో చేతిలో పైసా కూడా ఆడలేదు. దాంతో ముచ్చట తీరడం, తీర్చడం



కష్టమైంది.

వెల జీతాలందాయి.

ఆరోజు డైలీ న్యూస్ పేపర్లో రంగుల్లో ప్రత్యక్షమైన ప్రకటన విమల్ దృష్టినాకర్షించింది. 'ఆషాఢ మాసం వస్త్ర మహోత్సవం... గొప్ప తగ్గింపు ధరలతో సంచలనాత్మక ఆఫరు' అన్న స్లోగన్ కుమార్‌కి మళ్ళీ ఆశ పుట్టించింది.

"వందనా! ఈరోజు మనం షాపింగ్‌కు వెదుతున్నాం" అన్నాడు సంబరంగా.

"ఏంటటా! మళ్ళీ డిస్కౌంటు ఇస్తున్నారా?"

"మరేమనుకుంటున్నావ్! తయారవ్వు" అంటూ తొందర చేశాడు. షాపులో అన్ని రకాల చీరల్ని వెదికి వెదికి కిందటి సారి తను నచ్చిన, మెచ్చిన చీరను సెలెక్ట్ చేశాడు. లక్షరూపాయిల లాటరీ కొట్టినంత ఆనందం పొందాడు. వందన కూడ భర్త సరదానీ, సంతోషాన్నీ కాదనలేకపోయింది. విమల్ హుషారుగా క్యాషియర్‌కి నాలుగొందలు అందించాడు.

"వద్దు సార్! మూడొందలు చాలు. ఈ శారీ డిస్కౌంటు పోను మీకే వంద లాభం" అంటూ ఆ వందా తిరిగిచ్చేశాడు.

"థ్యాంక్స్" అంటూ ప్యాకెట్ పట్టుకుని రోడ్డు మీదికొచ్చి ఆటో బేరమాడి ఇద్దరూ ఎక్కారు. ఇంతలో ఎవరో ఒకావిడ ఆటోకి అడ్డం వచ్చి డ్రైవర్ని రిక్వెస్ట్ చేసింది. "అదే దారి కదా! ఎక్కించుకుందాం" అని డ్రైవర్ బ్రతిమిలాడేసరికి కాదనలేకపోయారు. వందన పక్కనే ఆమె కూర్చుంది. కొంత దూరం ప్రయాణించగానే "శారీస్ కొన్నారా మేడమ్! ఆషాఢ మాసం డిస్కౌంటా?" అని చిన్నగా నవ్వుతూ అడిగింది. ఆమె మాటలో ధ్వనించిన వెటకారానికి కించిత్ నొచ్చుకున్నా వందన గొప్పగా ఫీలవుతూ – "అవునండీ! చాలా చవగ్గా వున్నాయి. ఇదే టైపు చీర మా అత్తగారు పోయిన నెలలో నాలుగు వందలకు కొన్నారు. ఇప్పుడు సేమ్ వెరయిటీ చీర మూడు వందలకే ఇచ్చారు" అంది.

విమల్ హుందాగా, ఠీవిగా ఆమె వైపు చూశాడు.

"మేడమ్! మీకు ఒక మాట చెబుతాను వింటారా?" అందామె.

"ఊ! చెప్పండి" అంది వందన మరింత చురుగ్గా.

"మీరిప్పుడు కొన్న చీర మూడొందలు కాదు. రెండొందలే. ప్రింటింగ్ స్టిక్కర్ ఆరొందలు అంటించి రెండొందలు రిబేటు అని చెప్పి శ్రావణమాసం బంపర్ డిస్కౌంటుగా నాలుగొందలకి ఇచ్చారు. జనం పిచ్చిగా ఎగబడ్డారు. రద్దీ తగ్గింది. ఇప్పుడు ఆషాఢం వచ్చింది. అదే స్టిక్కర్ మీద ఫిఫ్టీ పర్సెంట్ మెగా ఆఫర్ రిబేట్ అని అనౌన్స్ చేయగానే అదే శారీ మూడొందలకిచ్చారు. ఈ వర్తకులు ఎన్ని మలుపులు తిప్పినా ప్రతి చీర మీదా అధమం వంద రూపాయిల నికర లాభం పొందుతూనే వున్నారు. అలాంటి జంతర్ మంతర్ ట్రిక్స్ ప్రయోగించి అమాయకుల్ని ఎలా మోసం చేస్తున్నారో మీకిప్పటికైనా అర్థమైందా?" అని చెప్పేసరికి ఆటోవాలాకు ఇంటి రూట్ చెప్పడమే మర్చిపోయినంతగా మతిపోయింది ఇద్దరికీ.

"ఇంతకీ మీరెవరు? ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు?" నమ్మలేని నిజాలు తెలుసుకున్నా నమ్మడం ఇష్టం లేనట్టుగా ప్రశ్నించాడు విమల్.

"నేనా! ఆ షాపులోనే సేల్స్‌లేడీగా పని చేస్తున్నాను" అని చెప్పి ఆడో దిగిపోయిందామె.

నిర్ఘాంతపోయారిద్దరూ. ఇంటికి చేరిన విమల్ తను ఎంతవరకు నష్టపోయిందీ బేరీజు వేసుకున్నాడు. 'ఆరోజు తల్లి పూర్ణమ్మను అడిగిన వెంటనే ఆమె కొనుక్కున్న జరీ చీర ఇచ్చేసి వుంటే... వంద రూపాయిలతో పాటు మరో వంద కూడ ఆశ జూపి అసలుకే మోసపోయేవాడిని. డిస్కౌంటు శారీలో ఇన్ని సుడిగుండాలుంటాయనుకోలేదు' అనుకున్నాడు. వందన ముఖం చూడాలంటేనే చెప్పలేనంత సిగ్గుగా వుంది అతనికిప్పుడు.